క్లుప్తంగా

మనోహరం భారతీయ నృత్యవైభవం

విజయవాడ కల్చరల్: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం, దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో దసరా మహోత్సవాల సందర్భంగా కనకదుర్గానగర్‌లోని కళావేదికమీద కళాకారులు ప్రదర్శిస్తున్న నృత్య కార్యక్రమాలు భారతీయ నృత్యవైభవాన్ని చాటుతున్నాయి. శుక్రవారం వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన కళాకారులు పలు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. హైదరాబాద్‌కు చెందిన లావణ్య బృందం కూచిపూడి సంప్రదాయంలో వాగ్గేయకార కీర్తనలకు నృత్యాలను అభినయించారు. వైష్ణవి, వెంకటేశ్వర శాస్త్రి, స్వాతి వాహిని, జి.శైలశ్రీ,దేవవర్షిణి, ఎస్.విజయలక్ష్మి, భాగవతుల వెంకటరామ శర్మ, ఆర్.వాణీకుమారి తమ బృందాలతో కూచిపూడి, భరతనాట్యం తదితర అంశాలలో నృత్యాలు ప్రదర్శించారు. భక్తి సంగీత కార్యక్రమంలో సూరంపల్లికి చెందిన బి.నాగమల్లేశ్వరమ్మ భక్తి గీతాలను, కె.గణేష్ కుమార్ శాస్త్రీయ సంగీతంలో సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. మృదంగ కళాకారిణి కె.జగన్మోహిని లయ విన్యాసం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాలను సాంస్కృతిక కార్యక్రమాల పర్యవేక్షకులు సైదా, గంగాధర్, రామకృష్ణ నిర్వహించారు. నిర్వాహకులు కళాకారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

జయహో జానపదం



విజయవాడకల్చరల్: వేదగంగోత్రి, గీతాంజలి మ్యూజిక్స్, దామోదర జానపదం, ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జైదుర్గాభవానీ సినీ సంగీత విభావరి పేరతో నిర్వహించిన కార్యక్రమం ఆకట్టుకుంది. దామోదర గణపతిరావు శివ శివమూర్తివి గణనాథా, శివశంకరా, దేవీ రావే దుర్గమ్మరావే తదితర భక్తి గీతాలను ఆలపించారు. డాక్టర్ జయంతి చక్రవర్తి, బీవీ దుర్గారావు, కె.ఉమాబలరాం, కె.దుర్గానాగమణి, రూపాశ్రీ, భక్తి గీతాలను, రుగ్వేదం సోదరీ మణులు అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో వేద గంగోత్రి వ్యవస్థాపకుడు జీవీఎన్ఆర్ఎస్ఎస్ వరప్రసాద్, బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి, చింతకాయల చిట్టిబాబు పాల్గొన్నారు

కనకదుర్గమ్మకు సంగీత నీరాజనం



విజయవాడకల్చరల్: కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వరంలో శోభకృత్ దసరా మహోత్సవాల సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సంగీత కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సంగీత విద్వాంసులు శాంతి, మాధురి, సుప్రియ, మానస, నాగవల్లి వీణపై సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. నృత్య కార్యక్రమంలో భాగంగా సాయి నిహారిక, యల్లాజోస్యుల అనూరాధ బృందాలు కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించారు. శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యంలో దసరా మహోత్సవాల సందర్భంగా సత్యనారాయణపురంలోని సంస్థ కార్యాలయంలో సంగీత సభను నిర్వహించారు. సంగీత సమితి విద్యార్థినులు ప్రణవి, లిఖిత, జయశ్రీ, శివప్రియ, చిట్టా దీపక్ వీణ సంగీత కచేరి, చిట్టా కార్తీక్ సంప్రదాయ కీర్తనలను ఆలపించారు.

మధురంగా సాగిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: రాగలహరి ఆధ్వర్యంలో దసరా మహోత్సవాల సందర్భంగా గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదిక మీద శనివారం నిర్వహించిన భక్తి సంగీతం, వాణీ జయరాం మ్యూజికల్ నైట్, గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. మల్లాది స్వాతి, అయ్యప్పన్ ఆధ్వర్యంలో గాయనీ గాయకులు అయ్యప్పన్, వద్దాది సూర్యకామేశ్వరి భక్తి గీతాలను, దండు చంద్రశేఖర్, ఆదిరాల జయప్రభ, చరణ్, సయ్యద్ ఆలీ, డేవిడ్‌రాజు వాణీజయరాం గీతాలను ఆలపించారు. వివిధ రంగాలకు చెందిన దావులూరి వీరభద్రరావు, చింతకాయల చిట్టిబాబు, బీవీ వీరభద్రరావు, ఇస్రాయల్, పవన్, డేవిడ్ రాజుతో పాటు గాయనీ గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.

నిత్యపారాయణీయ గ్రంథం దేవీ భాగవతం

విజయవాడ కల్చరల్: నిత్యపారాయణీయ గ్రంథం దేవీ భాగవతమని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మల్లాది రామనాథ శర్మ అన్నారు. శృంగేరీ పీఠాధిపతి భారతీ తీర్థ మహాస్వామి 70వ జన్మదినం సందర్భంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో దేవీ భాగవతం అంశంగా ఆయన ప్రసంగించారు. శక్తి రూపం కనులకు కనిపించేది కాదని అది సర్వజగత్తులో నిక్షిప్తమై వుంటుదన్నారు. కార్యక్రమంలో ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ నిర్వహించారు.

జ్ఞానధాత్రీ...వీణాపాణీ..వరదే కామరూపిణీ



శ్రీ దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో...




రామలింగేశ్వరపేటలో అమ్మవారు



విజయదుర్గానగర్‌లో...



బావాజీపేటలో శ్రీ సరస్వతీ దేవిగా అమ్మవారు



లబ్బీపేట శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో మహాసరస్వతిగా...

- సరస్వతీ దేవిగా పూజలు అందుకున్న అమ్మవారు
- మూలా నక్షత్రం, శుక్రవారం కలసి రావడంతో భక్తుల కిటకిట

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆరోరోజు శుక్రవారం మూలానక్షత్రం సందర్భంగా అమ్మవారు సరస్వతీదేవిగా పూజలు అందుకున్నారు. అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం, మూలానక్షత్రం కలసి రావటంతో పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో...

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యంలో శ్రీదేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారిని శ్రీ మహాలక్ష్మీవిగా అలంకరించి పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు, శ్రీచక్రార్చన, చండీ హోమం నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ చేతులమీదుగా పిఠాపురం వేదపండితుల మంత్రోచ్ఛరణలతో అక్షరాభ్యాసాలు జరిగాయి. చిన్నారులకు బలపాలు, పెన్నులు పంపిణీ చేశారు.

- బావాజీపేట నాలుగోలైనులో శ్రీదేవీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ట్రస్ట్ సభ్యురాలు బచ్చు మాధవీకృష్ణ పర్యవేక్షణలో అమ్మవారిని శ్రీసరస్వతీ దేవిగా అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించారు.
- దుర్గాపురంలో వీరమాచనేని లలిత ఆధ్వర్యాన శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో బాగంగా అమ్మవారిని శ్రీ సరస్వతీ దేవిగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.
- విజయదుర్గానగర్‌లో శుక్రవారం అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బీహెచ్ఎన్‌వీ జానా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. అనంతరం నాలుగువేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గోపి శెట్టి శ్రీను, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.
- చుట్టుగుంట ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను తోట పాండు పర్యవేక్షించారు.
- మధురానగర్ నేతాజీ కాలనీలోని శ్రీఅంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారిని శ్రీ సరస్వతీదేవిగా అలంకరించి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు పర్యవేక్షించారు.
- ముత్యాలంపాడులోని శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో బుధవారం అమ్మవారిని శ్రీ సరస్వతీదేవిగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.
- రామకృష్ణాపురం దుర్గాదేవి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.
- రామలింగేశ్వరపేట శ్రీ ప్రసన్నాంజనేయస్వామివారి దేవాలయం వద్ద ఆలయకమిటీ ఆధ్వర్యాన శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు తాన్న పూర్ణచంద్రరావు పర్యవేక్షించారు.
- గద్దే వెంకట్రామయ్యనగర్‌లో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు జరిగాయి.
- దావు బుచ్చయ్యకాలనీలో శ్రీ శ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.
- మధురానగర్ మెయిన్ రోడ్డులో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి పూజలు చేశారు.



శ్రీఅంకమ్మ తల్లి శక్తిపీఠంలో శ్రీ సరస్వతీదేవి అలంకారంలో...



గద్దే వెంకట్రామయ్యనగర్‌లో....

విజయవాడ కల్చరల్: శోభకృత్ నామ సంవత్సర దసరా మహోత్సవాల సందర్భంగా శుక్రవారం నగరంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

- దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో బాలత్రిపుర సుందరిని శ్రీ సరస్వతిగానూ, శారదాదేవిని వీణా శారదగానూ శ్రీ మహాలక్ష్మిని విద్యాలక్ష్మిగానూ అలంకరించారు.
- హనుమాన్‌పేట రాజరాజేశ్వరీ దేవాలయంలో విశ్వమాతా చారిటబుల్ సంస్థ, సిద్ధేశ్వరానందపీఠం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రమాసత్యనారాయణ ఆధ్వర్యంలో రుద్రహోమం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం జరిగింది.
- లబ్బీపేట శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో పార్వతీదేవి శ్రీ సరస్వతిగా భక్తులకు దర్శన మిచ్చింది.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ మల్లాది విష్ణు

గుణదల(విజయవాడ తూర్పు): ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలోని ఒకటో డివిజన్ ఒకటో సచివాలయం పరిధిలోని గాంధీజీ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ ఉద్దండి సునీతతో కలిసి ఆయా ప్రాంతంలోని 183 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్య సమస్యలతో బాధపడే వారు ఈ నెల 30, నవంబర్ ఒకటో తేదీన ఒకటో డివిజన్‌లో జరిగే ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో జరిగిన ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ఆరు వేల మందికి మెరుగైన వైద్య సేవలందించినట్లు చెప్పారు.

గుణదల సర్వతోముఖాభివృద్ధికి చర్యలు

సీఎం జగన్ పాలనలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంతో సాగుతున్నట్లు ఎమ్మెల్యే మల్లాది విష్ణు చెప్పారు. గడిచిన నాలుగేళ్లలో రూ.10.03 కోట్ల అభివృద్ధి పనులు డివిజన్‌లో చేపట్టినట్లు వెల్లడించారు. వీటిల్లో రూ.4.41 కోట్ల పనులు పూర్తి చేయగా రూ.5.62 కోట్ల పనులు వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు. దాదాపు రూ.4 కోట్లతో అంతర్గత రహదారులను నిర్మించినట్లు చెప్పారు. గుణదలలోని రెండు రైల్వే క్రాసింగ్‌ల వద్ద వంతెనల నిర్మాణానికి రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని వెల్లడించారు. దీని కోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.12.50 కోట్లతో భూమిని సమీకరించినట్లు వివరించారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ఆర్వోబీ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తోందన్నారు. నవంబర్ ఒకటో తేదీ నుంచి జరగబోయే 'ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రతిపక్షాల విష ప్రచారాన్ని తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీడీవో జగదీశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండా మహేశ్వరరెడ్డి, ఆళ్ల ప్రసాద్‌రెడ్డి, బండి వేణు, యలమంద, పావని, తుంగం యూన్సీ, ఆర్టీసీ శ్రీను, చంద్రశేఖర్, రమణి, ఫాతిమా, వివిధ శాఖల అధికారులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలి



విలేజి కండ్రికలో సరస్వతీదేవికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): శ్రీకనకదుర్గ అమ్మవారి దివ్యఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. శుక్రవారం మూలానక్షత్రం రోజున వాంబేకాలనీ హెచ్‌బ్లాక్ 262 సచివాలయం వద్ద దసరా మహోత్సవాల్లో భాగంగా అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకారం చేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్లాది విష్ణు హాజరై పూజలు చేశారు.స్థానిక కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి, 262వ నంబరు సచివాలయ కన్వీనర్ ఆర్ఎస్ నాయుడు, పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు. భక్తులు అధికసంఖ్యలో అమ్మవారి దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందారు.

గద్దే వెంకట్రామయ్య నగర్‌లో...

మధురానగర్(విజయవాడసెంట్రల్): అమ్మలగన్న అమ్మ దుర్గాదేవి అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. స్థానిక గద్దే వెంకట్రామయ్యనగర్‌లో శుక్రవారం శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో ఆయన పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఏటా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న గద్దే వెంకట్రామయ్యనగర్ భక్త బృంద సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో గద్దే శ్రీను, నూతక్కి శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

విలేజి కండ్రికలో...

పాయకాపురం(విజయవాడరూరల్): విలేజి కండ్రికలో జరుగుతున్న శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు పుట్టిన రోజు, మూలా నక్షత్రం నాడు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం జరిగిన పూజా కార్యక్రమంలో ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అమ్మవారికి పూజలు చేసి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో విలేజి కండ్రిక సొసైటీ చైర్మన్ మూలగొళ్ళ రవీంద్రరెడ్డి, నగర వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి యరగొర్ల శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల్లో క్యూలైన్ల పరిశీలన



క్యూలైన్‌లు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): మూల నక్షత్రం సందర్భంగా అమ్మవారిని సామాన్య భక్తులు త్వరగా దర్శనం కల్పించేలా మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అందులో భాగంగా శుక్రవారం ఉదయం ఆయన కొండ కింది భాగం నుంచి క్యూలైన్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించి భక్తుల రద్దీని క్రమపద్ధతిలో నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నారు. అలాగే భక్తుల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు అక్కడే ఉన్న అధికారులను సమాయత్తం చేశారు. మరుగుదొడ్లు, ఆలయ పరిసర ప్రాంతాలు, రోడ్లు, క్యూలైన్‌లు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. నిరంతరం క్యూలైన్‌లో ఉన్న భక్తులకు తాగు నీరు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. విజయ దశమి వరకూ అధికారులందరూ వారికి కేటాయించి స్థలాల్లో అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని ఆదేశించారు. నగరంలోని సీతమ్మ వారిపాధాలు, శనీశ్వర స్వామి ఆలయం, దుర్గా ఘాట్, పద్మావతి ఘాట్, భవానిపురం పున్నమి ఘాట్‌లను శుక్రవారం ఉదయం కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సిబ్బంది తో కలిసి పరిశీలించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఘాట్లో పారిశుద్ధ్యాన్ని నిర్వహించేందుకు ఆదేశాలిచ్చారు. కృష్ణవేణిఘాట్‌లోని కన్వేయర్ బెల్ట్ ను పరిశీలించి కన్వేయర్ బెల్ట్ చుట్టూ బ్యారిగేట్లు ఏర్పాటు చేయాలనీ అధికారులను సూచించారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, డెప్యూటీ సిటీ ప్లానర్ (ప్లానింగ్) జుబిన్ శిరన్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.





కనులపండువగా మహోత్సవాలు





ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ సన్నిధిలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కొండంతా కనులపండువగా మారింది. మూలా నక్షత్రం రోజైన శుక్రవారం అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. భక్తులు అమ్మవారిని కనులారా దర్శించుకొని ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. సరస్వతీదేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారి సన్నిధిలో తల్లిదండ్రులు తమ చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. కళావేదికపై నిర్వహించిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి వినతి



మంత్రి బొత్సకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి అనేక సంస్కరణలు ప్రవేశ పెట్టడంతో పాటు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ హామీ ఇచ్చినట్లు డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను తెలిపారు. అందులో భాగంగా ప్లస్ టు జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేసే ప్రధానోపాధ్యాయులకు ప్రిన్సిపాల్స్‌గా , జిల్లా పరిషత్ పీజీటీలకు పూర్తిస్థాయి వేతన స్కేల్‌తో పదోన్నతులు కల్పిస్తామని తెలియచేసినట్లు పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను నగరంలోన తన క్యాంపు కార్యాలయంలో కలిసి ఉపాధ్యాయులకు సంబంధించి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తమ సమస్యలపై మంత్రి బొత్స సత్యనారాయణ సానుకూలంగా స్పందించడంపై శ్రీను కృతజ్ఞతలు తెలియచేశారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంది వెంకట రమణ ఉన్నారు.

బాబాకు కనకాంబరాలతో లక్ష నామార్చన



బాబాకు పూజలు చేస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో షిర్డీసాయినాథుని 105వ పుణ్యతిథి మహోత్సవాలు శుక్రవారం ఆరోరోజుకు చేరుకున్నాయి. బాబావారికి విశేషంగా లఘు న్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం, పంచసూక్త పఠనం జరిగింది. క్షీరం, చెరకు రసంతో బాబాకు అభిషేకం చేసి కనకాంబరాలతో లక్ష నామార్చన చేశారు. లోక కల్యాణార్థం మందిర కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు సాయినాథ, లక్ష్మీనారాయణ హోమం వేదపండితుల మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.